క్లుప్తంగా

స్టడీ మెటీరియల్ పంపిణీ



కోస్గి: గురుకుల పాఠశాలల్లో 5వ తరగతి ప్రవేశానికి సంబంధించి నిర్వహించనున్న అర్హత పరీక్షకు సన్నద్ధమవుతున్న విద్యార్థులకు శనివారం బోవ్వానిపల్లి ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడు నర్సింహ స్టడీ మెటీరియల్ పంపిణీ చేశారు. మండలంలోని నాచరం పాఠశాలలో నలుగురికి, బొవ్వానిపల్లిలో 8 మందికి, ముశ్రీఫాలో 8 మందికి, భక్తిమళ్లలో ఐదుగురు విద్యార్థులకు స్టడీ మెటీరియల్ అందజేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో డీఆర్పీ వీర మల్లేశం పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థికసాయం

నర్వ: మండలంలోని పెద్దకడ్మూర్‌కు చెందిన బీఆర్ఎస్ నాయకుడు రజాక్ శనివారం గుండెపోటుతో మృతిచెందాడు. విషయం తెలుసుకున్న సింగిల్‌విండో వైస్‌చైర్మన్ లక్ష్మన్న, ఎంపీటీసీ రాధమ్మ అతడి కుటుంబ సభ్యులను పరామర్శించి, అంత్యక్రియల నిమిత్తం రూ.10వేల ఆర్థికసాయం అందజేశారు. మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించిన వారిలో బీఆర్ఎస్ నాయకులు దండు అయ్యప్ప, డా.శంకర్, ఎం.రాములు, శ్రీకాంత్‌రెడ్డి, వెంకటయ్యగౌడ్, శంకర్, శేఖర్‌గౌడ్ తదితరులు ఉన్నారు.

కొండప్పకు సన్మానం



దామరగిద్ద: బుర్రవీణ కళాకారుడు, పద్మశ్రీ అవార్డు గ్రహీత దాసరి కొండప్పను శనివారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఎస్ఐ వసంత శాలువాతో సన్మానించారు. ఈసందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ బుర్రవీణ కళా నైపుణ్యంతో పద్మశ్రీ అవార్డు సాధించడం గర్వకారణమన్నారు. అనంతరం రూ.4వేల ఆర్థికసాయం అందజేశారు. ఏఎస్ఐ అరుణ్, సిబ్బంది పాల్గొన్నారు.

ఎస్ఐకి సన్మానం

దామరగిద్ద మండల ఎస్ఐగా ఇటీవల బాధ్యతలు చేపట్టిన వసంతను అంబేడ్కర్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో శాలువాతో సన్మానించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ దామరగిద్ద పోలీస్‌స్టేషన్‌లో తొలి మహిళా ఎస్ఐగా బాధ్యతలు చేపట్టడం హర్షణీయమన్నారు. మహిళలు, బాలికల సమస్యలను పరిష్కరించడంతో పాటు శాంతి భద్రతలను పరిరక్షించి, మరింత ఉన్నత స్థానాలకు చేరాలని ఆకాంక్షించారు. అంబేడ్కర్ సంఘం నాయకులు గజలప్ప, నరేందర్, వెంకటప్ప, నర్సింహులు హన్మంతు పాల్గొన్నారు.

మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్‌పై ఫిర్యాదు

కోస్గి: కోస్గి మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ ఎం.శిరీషపై శనివారం కమిషనర్ సి.శిధర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. మున్సిపల్ చైర్‌పర్సన్ శిరీషపై ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మానాన్ని గతనెల 24న ఆమోదించినట్లు కమిషనర్ తెలిపారు. అయినప్పటికీ అదే రోజు సాయంత్రం చైర్‌పర్సన్ కుర్చీపై ఆమె కూర్చోవడంతో పాటు ఈనెల 2న మున్సిపల్ కార్యాలయానికి వచ్చి, అనుమతి లేకుండా చైర్‌పర్సన్ కుర్చీలో కూర్చున్నట్లు పేర్కొన్నారు. ఆమెపై తగు చర్యలు తీసుకోవాలని పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

సమస్యల పరిష్కారానికి ప్రత్యేక కార్యాచరణ



మాగనూర్: మండలంలోని గ్రామాల్లో నెలకొన్న విద్యుత్ సమస్యల పరిష్కారానికి ప్రత్యేక కార్యాచరణ రూపొందించినట్లు మండల విద్యుత్ అధికారి దేవేంద్రనాయుడు తెలిపారు. అన్ని గ్రామాల్లో విద్యుత్ లైన్లను సరిచేయడంతో పాటు అవసరమైన చోట కొత్త స్తంభాలను ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. గత వర్షాకాలంలో చిన్నపాటి గాలివానకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడి, ప్రజలకు కలిగిన ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని ముందస్తు చర్యలు చేపట్టినట్లు వివరించారు. ఎక్కడైనా విద్యుత్ సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని కోరారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

మద్దూరు: మండలంలోని పెద్దాపూర్ పెద్దవాగు నుంచి ఇసుకను అక్రమంగా తరలిస్తున్న ట్రాక్టర్‌ను శనివారం టాస్క్‌ఫోర్స్ పోలీసులు పట్టుకుని మద్దూరు పోలీస్‌స్టేషన్‌లో అప్పగించారు. కోయిల్‌కొండ మండలం సూరారం గ్రామానికి చెందిన రాజశేఖర్‌రెడ్డి ఎలాంటి అనుమతి లేకుండా పెద్దవాగు నుంచి ట్రాక్టర్‌లో ఇసుకను తరలిస్తుండగా పట్టుకున్నట్లు ఎస్ఐ సురేష్‌గౌడ్ తెలిపారు. ట్రాక్టర్‌ను సీజ్ చేయడంతో పాటు కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

గ్రామగ్రామాన సభలు



మాగనూర్ మండలం పర్మన్‌దొడ్డి గ్రామసభలో పాల్గొన్న గ్రామస్తులు

- అభివృద్ధి పనులపై చర్చించిన ప్రత్యేకాధికారులు
- ప్రజా సమస్యలపై ఆరా

మక్తల్: మండలంలోని 39 గ్రామపంచాయతీల్లో శనివారం ప్రత్యేకాధికారులు బాధ్యతలు చేపట్టారు. ఈసందర్భంగా గ్రామసభలు నిర్వహించి, ప్రజా సమస్యలను తెలుసుకున్నారు. గ్రామాల్లో చేపట్టాల్సిన అభివృద్ధి పనులపై చర్చించారు. ముఖ్యంగా పారిశుద్ధ్యం లోపించకుండా చూడాలని పంచాయతీ కార్యదర్శులు, సిబ్బందికి సూచించారు. అనంతరం ఆయా గ్రామాల తాజీ మాజీ సర్పంచులతో పాటు ప్రత్యేకాధికారులను సన్మానించారు. ప్రత్యేకాధికారులు నాగశివ, రహెమత్, విజయకుమార్, వనజ, రామేశ్వరి, మల్లేశ్వరి పాల్గొన్నారు.

మరికల్: గ్రామాల అభివృద్ధికి అందరూ సహకరించాలని ప్రత్యేకాధికారి శ్రీశైలం కోరారు. మండలంలోని అప్పంపల్లిలో నిర్వహించిన గ్రామ సభలో ఆయన మాట్లాడారు. గ్రామానికి మంజూరైన ఎన్ఆర్ఈజీఎస్ నిధులు రూ.5 లక్షలతో సీసీరోడ్లు నిర్మించాలని తీర్మానించినట్లు తెలిపారు. గ్రామంలో పర్యటించి సమస్యలను తెలుసుకున్నారు. పంచాయతీ కార్యదర్శి శివరాజ్ పాల్గొన్నారు.

కృష్ణా: మండలంలోని ఆలంపల్లిలో ప్రత్యేకాధికారి, ఆర్ఐ అమర్నాథ్‌రెడ్డి ఆధ్వర్యంలో గ్రామ సభ నిర్వహించారు. ఈసందర్భంగా గ్రామాభివృద్ధికి చేపట్టాల్సిన చర్యలతో పాటు వేసవిలో తాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా తీసుకోవాల్సిన ముందు జాగ్రత్త చర్యలపై చర్చించారు. అనంతరం తాజా మాజీ సర్పంచ్ రామకృష్ణ ధణి, ఉపసర్పంచ్, వార్డు సభ్యులను సన్మానించారు.

ఊట్కూరు: మండలంలోని ఓబులాపూర్ గ్రామ ప్రత్యేకాధికారిణిగా నియమితులైన సంతోషిని గ్రామస్తులు శాలువాతో ఘనంగా సన్మానించారు. అనంతరం గ్రామ సభ నిర్వహించారు. పంచాయతీ కార్యదర్శి శైలజ, మాజీ ఉపసర్పంచ్ వెంకటేష్‌గౌడ్, వెంకటప్ప, భాస్కర్‌రెడ్డి, రాఘవేందర్‌గౌడ్, ఎల్లప్ప, అంజప్ప, తిమ్మయ్య పాల్గొన్నారు.

మాగనూర్: మండలంలోని నేరడగం, భైరంపల్లి, ఉజ్జెల్లి, నేరడగండొడ్డి, మాగనూర్ తదితర గ్రామాల్లో తాజా మాజీ సర్పంచులు, వార్డు సభ్యులను ఎంపీపీ శ్యామలమ్మ ఘనంగా సన్మానించారు. గ్రామాల అభివృద్ధికి సర్పంచులు విశేషంగా కృషి చేశారని కొనియాడారు. అనంతరం ప్రత్యేకాధికారులను శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో ఎంపీటీసీలు ఎల్లారెడ్డి, ఆనంద్‌గౌడ్, వాకిటి శ్రీనివాసులు, నర్సింహారెడ్డి, ఉజ్జెల్లి కృష్ణయ్య, పి.ఆంజనేయులు, కృష్ణయ్య, వెంకటయ్య పాల్గొన్నారు.

❒ మండలంలోని 16 పంచాయతీల్లో ప్రత్యేకాధికారులు గ్రామసభలు నిర్వహించారు. 2023–24 ఆర్థిక సంవత్సరానికి గాను ఎన్ఆర్ఈజీఎస్ నిధులతో సీసీరోడ్లు నిర్మించాలని తీర్మానం చేశారు.

కోస్గి(మద్దూరు): మద్దూరు, కొత్తపల్లి మండలాల్లోని పంచాయతీల్లో ప్రత్యేకాధికారులు గ్రామ సభలు నిర్వహించారు. ఈసందర్భంగా సీసీరోడ్ల నిర్మాణం ఇతర అభివృద్ధి పనులపై చర్చించారు. సీసీరోడ్ల నిర్మాణానికి తీర్మానాలు చేశారు.

❒ మద్దూరు మండలం రెనివట్లలో తాజా మాజీ సర్పంచ్, వార్డు సభ్యులను గ్రామస్తులు ఘనంగా సన్మానించారు. ఐదేళ్ల కాలంలో గ్రామాభివృద్ధికి సహకరించిన గ్రామస్తులకు తాజీ మాజీ సర్పంచ్ భవానీ శంకర్ కృతజ్ఞతలు తెలిపారు. ఎంపీటీసీ కస్కమ్మ, పంచాయతీ కార్యదర్శి గోవర్ధన్‌రెడ్డి పాల్గొన్నారు.

దామరగిద్ద: మండల కేంద్రంలో ప్రత్యేకాధికారి నర్సింహారెడ్డి ఆధ్వర్యంలో గ్రామ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా అభివృద్ధి పనులపై చర్చించారు. అనంతరం తాజా మాజీ సర్పంచ్ వెంకటప్పతో పాటు వార్డు సభ్యులను శాలువాతో సత్కరించారు. పంచాయతీ కార్యదర్శి రాజయ్య, మాజీ ఉపసర్పంచ్ శివారెడ్డి, అంజిలమ్మ, అయ్యమ్మ, వెంకమ్మ, విజయలక్ష్మి, ఆనంద్ పాల్గొన్నారు.



మక్తల్ మండలం గుడిగండ్లలో ప్రత్యేకాధికారిని సన్మానిస్తున్న గ్రామస్తులు



అప్పంపల్లిలో సమస్యలు తెలుసుకుంటున్న ప్రత్యేకాధికారి శ్రీశైలం



రెనివట్ల గ్రామ సభలో మాట్లాడుతున్న ప్రత్యేకాధికారి నాగబాబు

ప్రభుత్వ స్థలం ఆక్రమణకు యత్నం

మరికల్: మండల కేంద్రంలోని బీసీ కాలనీలో తాగునీరు అందించేందుకు డ్రిలింగ్ చేసిన బోరుతో సహా అక్కడి ప్రభుత్వ స్థలాన్ని ఓ వ్యక్తికి అప్పగించేందుకు మాజీ ప్రజాప్రతినిధి చేసిన ప్రయత్నం బెడిసికొట్టింది. వివరాల్లోకి వెళ్తే.. బీసీ కాలనీకి తాగునీరు అందిచేందుకుగాను 25 ఏళ్ల క్రితం ప్రభుత్వం బోరు డ్రిలింగ్ చేసి, విద్యుత్ మోటార్ ఏర్పాటుచేసింది. ప్రస్తుతం శివస్వాములు అక్కడే నిత్యం స్నానాలు ఆచరించి, శివాలయంలో పూజలు చేస్తున్నారు. రెండు రోజుల కిందట బోరు మోటారుతో పాటు అక్కడున్న 100 గజాల స్థలాన్ని కొందరి సహాయంతో ఆక్రమించేందుకు మాజీ ప్రజాప్రతినిధి ప్రయత్నించారు. విషయం తెలుసుకున్న బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీ నాయకులు వారిని నిలదీయగా.. కలెక్టర్ సూచన మేరకు స్థలాన్ని అప్పగిస్తున్నామని చెప్పారు. దీనిపై కలెక్టర్‌ను ఫోన్‌లో సంప్రదించగా.. అలాంటిదేమీ లేదని తెలియజేశారు. దీంతో ఆక్రమణదారులు మాట మార్చే ప్రయత్నం చేశారు. ఆయా పార్టీల నాయకులతో పాటు కాలనీ వాసులు ఆందోళనకు దిగడంతో అక్కడి నుంచి జారుకున్నారు. కలెక్టర్ ఆదేశాల మేరకు ప్రభుత్వ స్థలానికి కంచె ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామని పంచాయతీ కార్యదర్శి శ్రీనివాసరావు తెలిపారు.

భూముల సర్వే



ఐనాపూర్‌లో ప్రభుత్వ భూములను సర్వే చేస్తున్న ఆర్ఐ, సర్వేయర్

కృష్ణా: మండలంలో ప్రభుత్వ భూములను సర్వేచేసి, హద్దులు నిర్ణయిస్తున్నట్లు ఆర్ఐ అమర్నాథ్‌రెడ్డి, సర్వేయర్ జయశంఖర్ తెలిపారు. శనివారం మండలంలోని ఐనాపూర్‌లో ప్రభుత్వ భూములను సర్వే చేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ కలెక్టర్ ఆదేశాల మేరకు ప్రభుత్వ భూములను పూర్తి స్థాయిలో సర్వే చేస్తున్నట్లు చెప్పారు. ఆయా గ్రామాల్లో మిగుల భూముల వివరాలను నమోదుచేసి, అధికారులకు నివేదిక సమర్పించనున్నట్లు తెలిపారు.

ముడుమాల్ జెడ్పీహెచ్ఎస్‌లో వైద్యపరీక్షలు



కృష్ణా: మండలంలోని ముడుమాల్ ఉన్నత పాఠశాలలో శనివారం డాక్టర్ అన్వేష్, మెడికల్ ఆఫీసర్ ప్రవీణ ఆధ్వర్యంలో విద్యార్థులకు వైద్యపరీక్షలు నిర్వహించారు. సుమారు 120 మందికి రక్త పరీక్షలు చేయడంతో పాటు బరువు, ఎత్తును పరిశీలించారు. అనారోగ్యంతో బాధపడుతున్న విద్యార్థులకు అవసరమైన మందులను పంపిణీ చేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ బాలబాలికలు తప్పనిసరిగా వ్యక్తిగత శుభ్రత పాటించాలని, పోషకాలు కలిగిన ఆహారం తీసుకోవాలని సూచించారు. కాగా వైద్యబృందం రెండు రోజుల పాటు ఇక్కడే ఉండి విద్యార్థులకు పూర్తి స్థాయిలో వైద్యపరీక్షలు నిర్వహిస్తున్నట్లు హెచ్ఎం నిజాముద్దీన్ తెలిపారు. కార్యక్రమంలో ఏఎస్ఎం సరిత, ఫార్మసిస్ట్ భాగ్యలక్ష్మి, ఉపాధ్యాయులు సంతోష్‌కుమార్, రేణుక తదితరులు పాల్గొన్నారు.

రేపటి నుంచి 'గావ్ చలో అభియాన్'



సమావేశంలో మాట్లాడుతున్న సురేందర్

ధన్వాడ: బీజేపీ ఆధ్వర్యంలో సోమవారం నుంచి గావ్ చలో అభియాన్ కార్యక్రమం నిర్వహించనున్నట్లు మండల అధ్యక్షుడు మాకం సురేందర్ తెలిపారు. శనివారం మండల కేంద్రంలో ఏర్పాటుచేసిన పార్టీ కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణ ఆధ్వర్యంలో ప్రతి పల్లెను సందర్శించి, ప్రధాని నరేంద్రమోదీ అమలుచేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను వివరిస్తారని తెలిపారు. గావ్ చలో అభియాన్ కార్యక్రమంలో కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో మాజీ వైస్ ఎంపీపీ ఉదయభాను, రాంచంద్రయ్య, ఎంపీటీసీలు గోవర్ధన్‌గౌడ్, ఉమేష్, కార్యదర్శి రాఘవేందర్, వెంకట్‌రెడ్డి, ఎర్రప్ప, శ్రీనివాస్‌గౌడ్, గోపి ఉన్నారు.

పదో తరగతి విద్యార్థులకు అల్పాహారం



కోస్గి: మండలంలోని సర్జఖాన్‌పేటకు చెందిన దివంగత మాలె వెంకటయ్య జ్ఞాపకార్థం ఆయన కూతురు సోషల్ వెల్ఫేర్ అధికారిణి బందెమ్మ స్థానిక ఉన్నత పాఠశాల పదో తరగతి విద్యార్థులకు అల్పాహారం అందిస్తున్నట్లు హెచ్ఎం కృష్ణమూర్తి తెలిపారు. ప్రత్యేక తరగతులకు హాజరవుతున్న 65 మంది విద్యార్థులకు ఉదయం అల్పాహారం, సాయంత్రం స్నాక్స్ అందించేందుకు ఆమె ముందుకొచ్చినట్లు చెప్పారు. విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. దాత బందెమ్మకు ఎంపీటీసీ నర్సింహులు, మాజీ సర్పంచ్ హరీష్‌గౌడ్, చంద్రశేఖర్, ఉపాధ్యాయులు కృతజ్ఞతలు తెలిపారు.

గొర్రెల పంపిణీ పథకం ప్రారంభించాలి



సమావేశంలో మాట్లాడుతున్న సత్యయాదవ్

నారాయణపేట: రాష్ట్ర ప్రభుత్వం గొర్రెల పంపిణీ పథకాన్ని వెంటనే ప్రారంభించాలని యాదవ సంఘం జిల్లా నాయకుడు సత్యయాదవ్ కోరారు. శనివారం జిల్లా కేంద్రంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. గత ప్రభుత్వంలో జిల్లా వ్యాప్తంగా 8వేల మంది లబ్ధిదారులు రూ.43,750 చొప్పున డీడీలు చెల్లించగా, 1200 మందికి గొర్రెల యూనిట్లు పంపిణీ చేయాల్సి ఉందన్నారు. అప్పులుచేసి డీడీలు చెల్లించిన కురుమ యాదవులకు గొర్రెల యూనిట్లు పంపిణీ చేయాలన్నారు. లేనిపక్షంలో డీడీ రూపంలో చెల్లించిన రూ.43,750కు బదులుగా ప్రభుత్వం ఇచ్చే యూనిట్ ప్రకారం రూ.1.75 లక్షలు చెల్లించాలని డిమాండ్ చేశారు. త్వరలోనే సీఎం రేవంత్ రెడ్డిని కలిసి సమస్యను తెలియజేస్తామని తెలిపారు. సమావేశంలో వివిధ మండలాలకు చెందిన కురుమ యాదవులు ఉన్నారు.

భారతరత్న ప్రకటనపై హర్షం

నారాయణపేట రూరల్: బీజేపీ సీనియర్ నాయకుడు, అయోధ్య రథయాత్ర వ్యవస్థాపక సభ్యుడు లాల్‌కృష్ణ అద్వానికి భారతరత్న ప్రకటించడంపై ఆ పార్టీ నాయకులు నాగురావు నామాజీ, రతంగపాండురెడ్డి, పి.శ్రీనివాసులు, రఘువీర్‌యాదవ్, రఘురామయ్యగౌడ్ ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. ఆయన సేవలకు తగిన ఫలితం లభించిందని తెలిపారు.

రాష్ట్రస్థాయి చెకుముకి పోటీలకు ఎంపిక



విద్యార్థులను అభినందిస్తున్న పాఠశాల కరస్పాండెంట్ ఎంఎస్ మీరా

మక్తల్: పట్టణంలోని కేరళ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు నందిని, పరియా, సాత్విక రాష్ట్ర స్థాయి చెకుముకి పోటీలకు ఎంపికైనట్లు జనవిజ్ఞాన వేదిక జిల్లా అధ్యక్షుడు మధు, కార్యదర్శి నర్సింహారావు తెలిపారు. ఈనెల 9, 10, 11 తేదీల్లో జనగామలో నిర్వహించనున్న రాష్ట్ర స్థాయి పోటీల్లో విద్యార్థులు పాల్గొంటారని పేర్కొన్నారు. ఈసందర్భంగా శనివారం పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో విద్యార్థులను పాఠశాల కరస్పాండెంట్ ఎంఎస్ మీరా, ప్రిన్సిపాల్ జార్జ్ జోసప్ అభినందించారు.

వైద్యవృత్తి ఉన్నతమైనది

అమరచింత: వైద్యవృత్తి ఉన్నతమైనదని రెడ్‌క్రాస్ జిల్లా ఉపాధ్యక్షుడు కలాంపాషా అన్నారు. జాతీయ మహిళా వైద్యుల దినోత్సవం సందర్భంగా శనివారం పట్టణంలోని డీఎంఆర్ఎం ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో విధులు నిర్వహిస్తున్న డాక్టర్ రూపశ్రీని ఘనంగా సత్కరించారు. కరోనా సమయంలో వైద్యులు అందించిన సేవలు వెలకట్టలేమన్నారు. కార్యక్రమంలో నాగేశ్వర్ రెడ్డి, రాజు, సుమిత్ర, కవిత, లక్ష్మినర్సమ్మ పాల్గొన్నారు.

ఫీల్డ్ అసిస్టెంట్లకు ఉద్యోగ భద్రత కల్పించాలి



కడా అధికారి వెంకట్‌రెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న ఫీల్డ్ అసిస్టెంట్లు

కోస్గి(మద్దూరు): ఉపాధి హామీ పథకంలో పనిచేస్తున్న ఫీల్డ్ అసిస్టెంట్లకు ఉద్యోగ భద్రత కల్పించాలని కోరుతూ శనివారం కొడంగల్ ఏరియా డెవలప్‌మెంట్ అధికారి వెంకట్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ పథకం ప్రారంభమైనప్పటి నుంచి చాలీచాలని వేతనంతో పనిచేస్తున్నామని.. పనికి తగ్గ వేతనం ఇవ్వడంతో పాటు ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు. అర్హత గల వారిని పంచాయతీ కార్యదర్శులుగా పదోన్నతులు కల్పించాలన్నారు. కారుణ్య నియామకాలు చేపట్టాలని, లిస్ట్–3 ఫీల్డ్ అసిసెంట్లను విధుల్లోకి తీసుకోవాలని కోరారు. ఫీల్డ్ అసిస్టెంట్ల సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు కేశవులు, మద్దూరు, కోస్గి మండలాల ఫీల్డ్ అసిస్టెంట్లు శేఖర్, మొగులప్ప, సత్తిరెడ్డి, దేశ్యానాయక్, రమేష్ పాల్గొన్నారు.

పాలమూరు న్యాయయాత్రను జయప్రదం చేయండి



సమావేశంలో మాట్లాడుతున్న రాఘవేందర్‌రెడ్డి

ధన్వాడ: ఏఐసీసీ రాష్ట్ర కార్యదర్శి వంశీచందర్‌రెడ్డి ఆదివారం నుంచి మండలంలో నిర్వహించనున్న పాలమూరు న్యాయ యాత్రను విజయవంతం చేయాలని నియోజకవర్గ కోఆర్డినేటర్ రాఘవేందర్ రెడ్డి, మండల అధ్యక్షుడు నారహరి కోరారు. శనివారం ధన్వాడలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. మక్తల్, నారాయణపేట, కొడంగల్ ప్రాంతాల్లో వ్యవసాయాభివృద్ధి కోసం అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకొచ్చిన జీఓ 69ను గత బీఆర్ఎస్ ప్రభుత్వం పక్కనపెట్టి తీవ్ర అన్యాయం చేసిందన్నారు. బీఆర్ఎస్ హయాంలో ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా అన్నిరంగాల్లో వెనుకబడిందన్నారు. ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం జీఓ 69 అమలుకు చర్యలు చేపట్టినట్లు తెలిపారు. ఏఐసీసీ రాష్ట్ర కార్యదర్శి వంశీచందర్‌రెడ్డి చేపట్టిన పాలమూరు న్యాయ యాత్ర గుమ్మకొండ పరాయుడి ఆలయం నుంచి ప్రారంభమై యంనోనిపల్లి, కంసాన్‌పల్లి మీదుగా ధన్వాడకు చేరుకుంటుందన్నారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు లక్ష్మణ్‌గౌడ్, కృష్ణమోహన్ ఉన్నారు.

మరికల్: ఏఐసీసీ రాష్ట్ర కార్యదర్శి వంశీచంద్‌రెడ్డి చేపట్టిన పాలమూరు న్యాయ యాత్రను విజయవంతం చేయాలని కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకుడు సూర్యమోహన్, మండల అధ్యక్షుడు వీరన్న కోరారు. మరికల్‌లో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి, రాహుల్‌గాంధీ ప్రధాని కావడమే లక్ష్యంగా ప్రతి కార్యకర్త పనిచేయాలని పిలుపునిచ్చారు. ఆదివారం నుంచి మరికల్ మండలంలో నిర్వహించే పాలమూరు న్యాయ యాత్రలో పార్టీ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. పట్టణ అధ్యక్షుడు హరీష్, సూర్యప్రకాష్, రామకృష్ణ, రాజు, వినితమ్మ, ఆంజనేయులు, రఘు, రామకృష్ణారెడ్డి, సత్యన్న తదితరులు ఉన్నారు.

దామరగిద్ద: మండలంలో సోమవారం నుంచి పాలమూరు న్యాయ యాత్ర నిర్వహించనున్నట్లు మండల అధ్యక్షుడు బాల్‌రెడ్డి ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటలకు క్యాతన్‌పల్లి వీరభద్రేశ్వర స్వామి ఆలయం నుంచి యాత్ర ప్రారంభమవుతుందని పేర్కొన్నారు.

ఇథనాల్ కంపెనీ మూసివేయాలి



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

మరికల్: చిత్తనూర్ ఇథనాల్ కంపెనీ మూసివేయాలని కోరుతూ శనివారం కంపెనీ వ్యతిరేక కమిటీ సభ్యులు స్థానిక తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ కంపెనీ నుంచి వెదజల్లే కాలుష్యాని దృష్టిలో ఉంచుకొని పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ఇచ్చిన అంశాలను అధికారులు పరిగణనలోకి తీసుకోవాలని కోరారు. ఈవిషయాన్ని ఇటీవల కలెక్టర్ దృష్టికి కూడా తీసుకెళ్లినట్లు చెప్పారు. కంపెనీ రద్దు కోసం సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. లేనిపక్షంలో బాధిత గ్రామస్తులు, రైతులతో కలిసి ఆందోళన కార్యక్రమాలు చేపడతామన్నారు. కార్యక్రమంలో చంద్రశేఖర్, వెంకట్రాములు, సుదర్శన్, వెంకటేష్ పాల్గొన్నారు.

అంకితభావంతో పనిచేస్తేనే గుర్తింపు



పీఈటీ వెంకటప్పను సన్మానిస్తున్న ఎంపీటీసీ బస్వరాజ్

దామరగిద్ద: అంకితభావంతో విధులు నిర్వర్తిస్తేనే గుర్తింపు లభిస్తుందని ఎంపీటీసీ బస్వరాజ్ అన్నారు. మండలంలోని కాన్‌కుర్తి ఉన్నత పాఠశాల పీఈటీ వెంకటప్ప ఇటీవల కలెక్టర్ చేతులమీదుగా ఉత్తమ పీఈటీ అవార్డు అందుకున్నారు. ఈసందర్భంగా శనివారం పాఠశాలలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో పీఈటీ వెంకటప్పను కాంగ్రెస్ పార్టీ నాయకులు శాలువాతో సన్మానించి అభినందించారు. పాఠశాల విద్యార్థులకు ఆసక్తిగల క్రీడల్లో శిక్షణ ఇస్తూ, అన్నివిధాలా ప్రోత్సహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో హెచ్ఎం విశ్వనాథ్, శివరాములు, సునీత, ఇ.విశ్వనాథ్, సతోష్, శివకుమార్, కవిత, బాల్‌రాజు, గౌస్, చంద్రశేఖర్, గోపాల్‌రెడ్డి, అంకిత, మొగులప్ప పాల్గొన్నారు.

ఉన్నత లక్ష్యాలతో ముందుకుసాగాలి



విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న ప్రిన్సిపాల్ మద్దిలేటి

కోస్గి(మద్దూరు): విద్యార్థులు ఉన్నత లక్ష్యాలతో ముందుకు సాగాలని ప్రిన్సిపాల్ మద్దిలేటి సూచించారు. శనివారం మద్దూరు ప్రభుత్వ జూనియర్ కళాశాల వార్షికోత్సవం నిర్వహించారు. ఈసందర్భంగా విద్యార్థులకు నిర్వహించిన క్రీడా పోటీల్లో ప్రతిభ కనబర్చిన వారికి బహుమతులను ప్రదానం చేశారు. అనంతరం ప్రిన్సిపాల్ మాట్లాడుతూ ఇంటర్మీడియట్ దశలోనే విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకోవాలని సూచించారు. ప్రణాళికాబద్ధంగా చదువుకుని పోటీ పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించాలని తెలిపారు. కార్యక్రమంలో అధ్యాపకులు రాములు, రాజేష్, శ్రీనురెడ్డి, విజయకాంత్, రమేష్, లక్ష్మీరెడ్డి, సంతునాయక్, మధుసూదన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా మర్దాన్ అలీషా గంధోత్సవం



గంధోత్సవంలో పాల్గొన్న భక్తులు

స్టేషన్ మహబూబ్‌నగర్: జిల్లా కేంద్రం షాసాబ్‌గుట్ట హజ్రత్ సయ్యద్ మర్దాన్ అలీషా దర్గా 98వ ఉర్సు ఉత్సవాలు ఘనంగా సాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా ప్రధాన ఘట్టమైన గంధోత్సవం శనివారం రాత్రి వైభవంగా నిర్వహించారు. గంధోత్సవాన్ని షేక్ మొహియొద్దీన్ ఇంటి నుంచి వన్‌టౌన్, న్యూటౌన్‌ల మీదుగా దర్గా వరకు తీసుకెళ్లారు. ఊరేగింపులో భక్తులు భక్తిగీతాలు ఆలపించారు. అనంతరం దర్గాలో చాదర్లు, పూలు సమర్పించి ప్రత్యేక ఫాతేహాలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని దర్గాలో ప్రార్థనలు చేశారు. ఉత్సవాల్లో భాగంగా ఆదివారం దీపోత్సవం, ఖవ్వాలి కార్యక్రమం ఏర్పాటు చేస్తామని, 5న దర్గాలో ఖత్మే ఖురాన్ నిర్వహించి భక్తులకు ప్రసాదం పంపిణీ చేస్తామని పీఠాధిపతి రజాక్‌షాఖాద్రీ తెలిపారు. ఉర్సు ఉత్సవాల సందర్భంగా దర్గా ప్రాంగణంలో దుకాణాల సందడి నెలకొంది.